ప్రజాశక్తి

గురువారం 18 జూలై 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



విజయవాడలో కురుస్తున్న వర్షంతో స్తంభించిన వ్యాపారాలు

ఎడతెరిపి లేని వర్షాలు

లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు • పారిశుధ్యం అధ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. రాత్రి 7 గంటల సమయంలో వర్షం కురిసింది. రాత్రి పొద్దు పోయేంత వరకు కురుస్తూనే ఉంది. తొలి ఏకాదశి, మొహరం పండుగ ఒకే రోజు రావడంతో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. దీంతో రోడ్లపై పెద్దగా రద్దీ కనిపించలేదు. అయితే హాకర్లు, చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు వర్షం కారణంగా వ్యాపారాలు కోల్పోయారు. విజయవాడ నగరంలో రహదారుల వెంట, ముఖ్యంగా బీసెంట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో హాకర్ల వ్యాపారాలపై వర్షం ప్రభావం తీవ్రంగా పడింది. అస్తవ్యస్తంగా తయారైన డ్రైనేజీ కారణంగా చినుకుపడితే చిత్తడే అన్న పరిస్థితిగా ఉంది. వన్‌టౌన్ హెచ్‌బి కాలనీ, విజయ డెయిరీ, నైజాం గేటు, చిట్టినగర్, పంజాసెంటర్, హనుమాన్‌పేట, సూర్యారావుపేట, సింగ్‌నగర్, కండ్రిక తదితర పలు ప్రాంతాలతోపాటు గవర్నర్‌పేట, గాంధీనగర్, సిద్ధార్థ పాలీక్లీనిక్ రోడ్, కృష్ణలంక, రాణిగారితోట, పటమట రైతు బజార్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని బయటకు పంపడానికి సరైన వసతులు లేవు. మోటారు ఇంజన్లు అవసరానికి అనుగుణంగా లేవు. సిబ్బంది కూడా అరకొరగానే ఉన్నారు. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మరోవైపు మారిన వాతావరణం, అడపాదడపా రోజువారీగా కురుస్తున్న వర్షాలు, పెరిగిపోతున్న దోమలు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, పూర్తి స్థాయిలో జరగని చెత్త తరలింపు, పెరిగిన పనిభారానికి అనుగుణంగా క్లీనింగ్, స్వీపింగ్‌కు కార్మికులు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కొండ ప్రాంతాలు, మురికివాడలు, రైతు బజార్లు తదితర ఏరియాల్లో చెత్త ఊడవటం పూర్తి స్థాయిలో జరగడం లేదు. దీంతో మురికివాడలు, లోతట్టు ప్రాంతాల నివాసులు, కొండ ప్రాంతాల వాసులు ఇబ్బందిపడుతున్నారు.



విజయవాడలో కురుస్తున్న వర్షం

తస్మాత్ జాగ్రత్త !

పెరుగుతున్న పాము, కుక్క కాట్లు



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

వ్యవసాయ సీజన్లో పాముల బెడద పెరిగిపోతోంది. పాము కాట్లు అధికమవుతున్నాయి. రెండు నెలల వ్యవధిలోనే కృష్ణాజిల్లాలో ఇద్దరు యువకులు పాము కాటుతో మరణించారు. అనేక మంది ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. పాముకాటు బారిన పడేవారిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. మరోపక్క సీజన్‌తో సంబంధం లేకుండా వీధి కుక్కలు ప్రజలను వెంటాడి కరుస్తున్నాయి. జిల్లాలో వీటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయి.

వ్యవసాయ సీజన్లో పెరిగిన పాముల బెడద

ఈ ఏడాది మే 27వ తేదీన మొవ్వ మండలం పెదపారుపూడికి చెందిన నాదెళ్ల వంశిసూర్య మణికంట (24), జూన్ 10వ తేదీన మోపిదేవి మండలం అన్నవరంకు చెందిన యువరైతు గంజి శ్రీహరి (25) పాటు కాట్లకు గురై మరణించారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి క్రమంగా పాము కాట్లు పెరుగుతున్నాయి. జూలైలో మొదటి 16 రోజుల్లోనే 46 మంది పాముకాటుకు గురయ్యారు. వ్యవసాయ సీజన్లో ప్రతి ఏటా పాము కాట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ సీజన్‌లో దివి సీమ ప్రాంతంలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో, కాల్వగట్లు, పొలాల్లో సరిహద్దు గట్లపై ఉండే పుట్టలు, చెత్త చెదారంతో నిండి ఉండే ప్రాంతాలు, కప్పలు, ఎలుకలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు పాములకు ఆవాసాలు ఉంటున్నాయి. సీజన్లో కురిసే వర్షాలు, కాల్వల నుంచి వచ్చే నీరుతో పుట్టలు, ఎలుకల కలుగులు నిండటంతో పాములు వెలుపలకు వస్తున్నాయి. పొలం గట్లపైన, బురద పొలాల్లో ఆహారం కోసం సంచరిస్తున్నాయి. పొలం పనులకు వెళ్లే వారు గమనించక వీటిపై కాలువేయడం లేక వీటికి దగ్గరగా వెళ్లిన సందర్భంలో (మిగతా 2లో)



పాము, కుక్కకాటు బాధితుల వివరాలు

నెల	పాము కాటు	కుక్క కాటు
ఏప్రిల్	21	1,103
మే	36	1,145
జూన్	40	0,807
జులై (ఇప్పటికి)	46	0,455
మొత్తం	143	3,510

కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి : బాధితులు

'పామర్రు బందర్ రోడ్, లాకుల రోడ్‌లో ఓ వీధి కుక్క గత నెల రోజులుగా చాలా మందిని కరిచింది. గాయాలు పాలైనవారు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఇంజక్షన్ చేయించుకుంటున్నారు. గ్రామంలో కుక్కల సంఖ్య బాగా పెరిగింది. కుక్క కాటుకు గురై రేబిస్ వ్యాధితో చనిపోతున్న వారు లేకపోలేదు, కుక్కల నివారణకు గ్రామ పంచాయతీ, రెవెన్యూ, సేవా సంస్థలు ఆలోచన చేయాలి.' అని కుక్క కాటు బాధితులైన పామర్రు ఎన్టీఆర్ సర్కిల్ కొబ్బరితోట వాసి సరిదే రాంబాబు, జిఒ సిమ్ వెండర్ శ్రీకాంత్, సోమవరపు రామారావు కోరుతున్నారు. జంతుసంరక్షణ, బ్లూ క్రాస్ నిబంధనల పేరుతో ప్రభుత్వాధికారులు కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టకపోతే అనేక మంది రేబిస్ వ్యాధి బారినపడి ఎంతో మంది బలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

అందుబాటులో ఇంజక్షన్లు

జి.గీతాబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి



పాముకాటుకు చికిత్స అందించేందుకు అవసరమైన యాంటీస్నేక్ వీరం సీరం ఇంజక్షన్లను జిల్లాలోని 49 పిహెచ్‌సిలు, ఏడు సిహెచ్‌సిల్లో నాలుగు వేల డోస్‌లను అందుబాటులో ఉంచాం. కుక్క కాటుకు గురైన వారికి యాంటీ రేబిస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ సీజన్లో పాము కాట్లు ఎక్కువగా ఉంటున్నాయి. అందువల్ల వ్యవసాయ పనులకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి. పాముకాటుకు గురైన వ్యక్తికి 20 నిమిషాల నుంచి గంటలోపు చికిత్స ప్రారంభిస్తే ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు.

లభ్యం కాని ఎంపిడిఒ ఆచూకీ

- ఏలూరు కాల్వలో కొనసాగుతున్న గాలింపు
- 30 మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది, 15 మంది పోలీసులతో మూడు బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ : నర్సాపురం ఎంపిడిఒ మండవ వెంకటరమణారావు అదృశ్యం కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. దీనిలో భాగంగా విజయవాడలోని మధురానగర్ ఏలూరు కాలువ వద్ద నుంచి దిగువకు నాలుగు కిలోమీటర్ల పొడవున ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన రెండు బృందాలు, స్థానిక పోలీసులు మొత్తం మూడు బృందాలుగా ఏర్పడి బుధవారం పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు కిలోమీటర్ల పొడవున గాలించారు. అయినా ఆచూకీ తెలియలేదు. సాయంత్రం కావడం, వర్షం కురుస్తుండడం, చీకటి, గుర్రపుడెక్క బలంగా అల్లుకొనిపోవడం తదితర కారణాలతో గాలింపునకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు పెనమలూరు సిఐ రామారావు ప్రజాశక్తికి తెలిపారు. గురువారం కూడా ఎంపిడిఒ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో మధురానగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో కాల్వ వద్ద ఆయన సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆగిపోయాయి. అందిన సమాచారం మేరకు పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏలూరు కాల్వలో గాలిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత

- కృష్ణాజిల్లా నూతన ఎస్‌పి గంగాధరరావు
- బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని కృష్ణాజిల్లా నూతన ఎస్‌పి ఆర్.గంగాధర రావు స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా ఎస్‌పిగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐపిఎస్‌ల బదిలీల్లో భాగంగా ఎపి సిఐడి ఎస్‌పిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వారి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా ముందుంటామన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, వద్ధులకు సంబంధించిన ఘటనల్లో ఉపేక్షించేదిలేదన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికడతామన్నారు. గంజాయి కేసుల్లో నిందితులను విడిచిపెట్టేదిలేదన్నారు. ఇందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా గంజాయి ఆనవాళ్ల గురించి సమాచారం తెలిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా నిలపడానికి శాయిశక్తులా కషి చేస్తానన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, వాటి నిరోధానికి ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలను నేరుగా తనకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారున. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టాల ప్రకారం ముందుకు వెళతామని (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

తస్మాత్ జాగ్రత్త !

కాటు వేస్తున్నాయి.

పెరిగిన వీధి కుక్కల సంచారం

పామర్రు లాకుల ప్రాంతంలోని ఓ వీధి కుక్క నెల రోజుల వ్యవధిలో వెంటాడి మరీ ఆరుగురిని కరిచింది. దీని బారి నుండి కాపాడాలని ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఈ వీధి కుక్క ఫొటో తీసి వాట్సాప్‌లో పోస్టు చేశారు. సీజన్తో పనిలేకుండానే జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కుక్కల బెడద ఎక్కువైంది. వీటి నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నెలకు వెయ్యి మందికిపైగా కుక్క కాటుకు గురవుతున్నారు. ఏప్రిల్ నుంచి 106 రోజుల వ్యవధిలో జిల్లాలో 3,510 మంది కుక్కకాటుకు గురయ్యారు. కుక్కకాటు బాధితులు రేబిస్ వ్యాధి బారిన పడతామనే ఆందోళనలో ఉన్నారు. కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. చికిత్సకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితిలో ఉంటున్నారు.

మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత

స్పష్టం చేశారు. తొలుత జిల్లా కలక్టర్ డికె.బాలాజీని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) జి.వెంకటేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి ఎస్.వి.డి.ప్రసాద్, పలువురు డిఎస్‌పిలు, పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ఏలూరు రేంజ్ ఐజీపి జివిజి.అశోక్ కుమార్‌ను నూతన ఎస్‌పి ఆర్.గంగాధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఐజీపి జివిజి.అశోక్ కుమార్‌ను కలిసిన నూతన ఎస్‌పి ఆర్.గంగాధరరావు

లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

యూనియన్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి- భవానీపురం

ఖాతాదారుల ఆధారాభిమానాలు పొందడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన బ్యాంకు అధికారులకు సూచించారు. నగరంలోని విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు బ్రాంచిని బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి సజన జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మన జిల్లాలో 73 బ్రాంచ్‌లు, విజయవాడ నగరంలో 40 బ్రాంచ్ శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలను అందిస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ డిపాజిట్ల కోసం జన్ ధన్ ఖాతాలని మరింత పెంపొందించు కావాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ భాస్కరరావు మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా వ్యవసాయ దారులకు పారిశ్రామిక వేత్తలతో పాటు విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.



యూనియన్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

ఖాతాదారుల అభిమానాన్ని పొందడమే ప్రధాన ఎజెండాగా తమ బ్యాంకు అధికారులు సేవలందిస్తారన్నారు. స్వయం సహాయ సంఘాలకు గహ నిర్మాణాల లబ్దిదారులకు, వ్యవసాయ, విద్య రుణాలు అందించేందుకు కషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాధరపురానికి చెందిన నాగ సునీతకు ఏడు లక్షల రూపాయల కార్ లోన్ అందజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సీవీయన్ భాస్కరరావు, రీజనల్ హెడ్ మువ్వల శ్రీధర్, డిప్యూటీ రీజనల్ హెడ్స్ హరీష్ బేతా, ఐఎస్ఎస్ మూర్తి, ఇతర బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిని కలిసిన నూతన ఎస్ఐలు

ప్రజాశక్తి - విజయవాడ : ఏలూరు రేంజి పరిధిలో విధులు నిర్వహిస్తున్న 18 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు సర్వీసు ప్రాతిపదికన అర్హతను బట్టి సబ్ ఇన్స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈనేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషరేట్‌కు అలాట్ చేసిన ఏడుగురు ఎస్ఐలు బుధవారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిపి చేతుల మీదుగా ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరిస్తూ ఎన్‌టిఆర్ పోలీసు కమిషరేట్‌లో రిపోర్టు చేశారు. సిపిని కలిసిన నూతన ఎస్ఐలలో ఏ.శ్రీనివాసరావు, బి.పైడేశ్వర రావు, కె.సత్యనారాయణ, ఏ.సూర్యనారాయణ, వై.కపానందం, బి.ఆనంద బాబు, జి.జాషువా రాజు ఉన్నారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ వారికి అభినందనలు తెలిపారు.



విఎంసి కౌన్సిల్‌లో పట్టుకోల్పోతున్న అధికారపక్షం

వైసిపి వైఫల్యాలపై టిడిపి దృష్టి సారించేనా?

ప్రజాశక్తి - విజయవాడ

మంచి జరిగితే పాలకవర్గం ఖాతాలో...నష్టం వాటిల్లితే అధికారుల ఖాతాల్లో అన్న పద్ధతిలో విఎంసిలోని అధికార వైసిపి తీరు నడుస్తోంది. గత మూడేళ్లుగా అప్రజాస్వామిక పద్ధతిలో, ఏకపక్షంగా కౌన్సిల్‌ను నిర్వహించడంతోపాటు అడ్డగోలు నిర్ణయాలు చేసిన అధికారపక్షం... మారిన రాజకీయాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం టిడిపి సూచనలు, సలహాలు తీసుకోకుండా అడుగు ముందుకు వేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈనెల 10న జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగిన తీరే వీటికి నిదర్శనంగా చెప్పవచ్చు. అయితే గతంలోప్రజలకు భారంగా తయారైన పలు అంశాలను రద్దు చేస్తూ కౌన్సిల్ నిర్ణయించడంతోపాటు ఆ తీర్మానాలను ప్రభుత్వానికి పంపాలని విపక్షాలుగా ఉన్న టిడిపి, సిపిఎం సభ్యులు చేసిన ప్రతిపాదనలపై కనీసం చర్చకు తావివ్వలేదు. గత మూడేళ్ల కౌన్సిల్ సమావేశాల్లో వివిధ రకాల పన్నుల భారాలను తొలగించాలని, వాటిని రద్దు చేయాలని కౌన్సిల్‌లో విపక్షాలు అడగటమే ఒక నేరంగానో...తప్పుగానో భావించడమే గాక, అడిగిన విపక్షాల సభ్యులను అధికార వైసిపి మార్షల్స్ సాయంతో అతి బలవంతంగా బయటకు గెంటేసిన చరిత్ర అందరికీ తెలిసిందే. సీజనల్ వ్యాధులు, కలుషిత నీరు, డ్రైనేజి సమస్య, దోమల బెడద, కుక్కలు, ఆవులు, కోతుల బెడద, ప్రధానంగా ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన వందల కోట్ల పెండింగ్ నిధులు, రహదారుల సమస్య, ఆక్రమణలు, కారుచౌకగా విఎంసి ఆస్తుల ఆక్రమణ, ఎస్టేట్ ఆస్తులకు రక్షణ లేకపోవడం తదతర అనేక విలువైన అంశాలపై కనీసమైన చర్చలకు కూడా తావివ్వలేదు. భారాలు, లోపాలను ఎత్తి చూపడమే ఒక నేరంగా భావించిన అధికారపక్షం ప్రస్తుతం వాటన్నింటికీ భిన్నమైన రీతిలో గత బుధవారం నిర్వహించిన కౌన్సిల్ నిర్వహణ తీరు తేటతెల్లం చేస్తుంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులు, భారాలు, ఆగిపోయిన వివిధ రకాల అభివృద్ధి పనులపై టిడిపి, సిపిఎం... అధికార వైసిపిని నిలదీయగా, ఆ వైఫల్యాలన్నింటికీ తాము బాధ్యులం కాదని, అధికారులే కారణమన్నట్లుగా వారివైపు వెలెత్తిచూపే విధంగా నగర మేయర్ కౌన్సిల్ సమావేశంలో వ్యవహరించారు. దీనిపై అధికారులు కూడా గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. నిధులు, తగిన సిబ్బంది తదితర వనరులను కల్పిస్తే ప్రజలకు మెరుగైన సదుపాయాలను అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని పలువురు అధికారులు చెబుతున్నారు. పారిశుధ్య కార్మికులకు చేతి గ్లౌజ్‌లు, సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు, చాలీచాలనీ వేతనాలు, వీధుల్లో చెత్తసేకరణ ట్రైసైకిళ్లు, పారలు తదితర ఇతర కనీస సదుపాయాలు కల్పించకుండా పారిశుధ్యం మెరుగుదల ఎలా అవుతుందని టిడిపి, సిపిఎం సభ్యులు ప్రశ్నించారు. పెరిగిన పని భారానికి అనుగుణంగా 1500 మంది పారిశుధ్య కార్మికులు అవసరమని, వారిని భర్తీ చేసుకోవాల్సిన అవసరం ఉందని స్వయంగా నగర కమిషనర్ చేసిన సిఫార్సులకే విఎంసిలో దిక్కులేకుండా పోయిందని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కార్మికులను భర్తీ చేసుకోవడంతోపాటు కార్మికుల కనీస సదుపాయలు కల్పించాల్సిన అవసరం కౌన్సిల్ బాధ్యత తీసుకోవాలని రాజకీయాలకతీతంగా కౌన్సిల్‌లో తీర్మానించారు. కలుషిత నీరు కారణంగా అతిసార బారినపడి మొగల్రాజపురం, కండ్రిక ప్రాంతాల్లో 9 మంది మృత్యువాత పడినా, వందల మంది ఆస్పత్రుల పాలైనా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. నేటికీ మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచలేని దారుణమైన పరిస్థితుల్లో నగరపాలక సంస్థ పాలకవర్గం తయారైంది. కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వర్‌నగర్, పటమట తదితర ప్రాంతాల్లోని 60 శాతం ప్రజలు బోరు నీటినే తాగాల్సి వస్తోంది. శుద్ధి చేసిన కృష్ణా నీటిని ఎప్పటిలోపు నగర ప్రజలకు సరఫరా చేస్తారని పలువురు కార్పొరేటర్లు అధికార వైసిపిని నిలదీశారు. గృహ, వాణిజ్య కేంద్రాల నుంచి వసూలు చేస్తున్న చెత్త పన్ను (యూజర్ ఛార్జీలు)ను ఉపసంహరించుకోవాలని, అలాగే నివాస భవనాలపై 0.13 శాతం, నివాసేతర భవనాలపై 0.30 శాతం పెంచిన పన్నులను ఉపసంహరించుకోవాలని టిడిపి, సిపిఎం సభ్యులు గత కౌన్సిల్‌లో వేర్వేరుగా ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను ఆమోదించి, చేసిన తీర్మానాలను అధికారపక్షం రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతుంది. ఇవే అంశాలపై గతంలో విపక్షాలు ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను ఆమోదించకపోగా, బుట్టదాఖలు చేసిన వైనం లేకపోలేదు. కౌన్సిల్ అజెండా రూపకల్పనలో, దానిలోకి తీసుకురావాల్సిన అంశాలపై కూడా అధికార వైసిపిలో తలోదారి అన్నట్లుగా కౌన్సిల్ సందర్భంగా ప్రస్ఫుటమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు అయ్యే రూ.3 కోట్ల వ్యయం అంశం అధికార వైసిపిలోనే భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. చివరకు ఇదే అంశంపై అధికార వైసిపిని ఇరకాటంలో పెట్టే విధంగా విపక్షాల సభ్యులకు, అధికార పక్షం సభ్యులే సమాచారం అందించడం గమనార్హం.



పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో డివిజన్ల వారీగా ప్రతిరోజు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సిహెచ్‌వివి ఎస్ బాపిరాజు తెలిపారు. బుధవారం 22వ డివిజన్‌లో నిర్వహించిన డ్రైవ్‌లో పారిశుధ్య పనులు, రోడ్ల ప్రక్కన వున్న మట్టిని చెత్తచెదరములను జె సి బి తో తొలగించు పనులను పర్యవేక్షించారు. వార్డులలో ఎక్కడ అపరిశుభ్రత చోటు చేసుకోనకుండా తగు చర్యలు తీసుకోవాలని, హెల్త్ అసిస్టెంట్ కు, పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గుడివాడ : కృష్ణా జిల్లా (ఎఐటియుసి అనుబంధ) హమాలీస్ (ముఠా) వర్కర్స్ యూనియన్ 10వ మహాసభ బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ మహాసభకు అధ్యక్షులుగా గూడపాటి ప్రకాష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఏఐటియుసి కన్వీనర్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య నేతృత్వంలో హమాలీ(ముఠా) కార్మిక సంఘం జిల్లా నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దుంపల వెంకటనరసింహారావు (స్వామి), ఉపాధ్యక్షులుగా యు.వేణు, ఆరేపల్లి రామారావు, జిల్లా సహాయ కార్యదర్శులుగా డి.నరసింహారావు, దేవర శ్రీను, గొరిపర్తి శ్రీనివాసరావు, కోశాధికారిగా వెంకన్నలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణజిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, పట్టణ ముఠావర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.శేషు, ఎఐటియుసి నాయకులు చింతలూరి సత్యనారాయణ, కార్మిక సంఘాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కొల్లిపర నాగ పోతరాజు (మధు) సతీమణి శివ పార్వతి జయంతి సందర్భంగా స్థానిక పార్వతమ్మ తోట లోని ఆదరణ వద్ధాశ్రమము, నిమ్మల తోట సియోను వద్ధాశ్రయంలలో వద్ధులకు అన్నదాన బుధవారం వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణం కోసం సియోను వృద్ధాశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు రూ 10,116లు ఆర్థిక సహాయంను కొల్లిపర మధు అందించారు. ఈ కార్యక్రమాలలో లయన్ మధు కుటుంబ సభ్యులు,లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాయపాటి రాధాకృష్ణ, కార్యదర్శి కస్తూరి వెంకట వర ప్రసాద్, నర్రా సాయిబాబు పాల్గొన్నారు

మహిళా న్యాయవాదికి సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి : భారతీయ న్యాయ సంహిత ద్వారా దేశంలో ఏర్పడిన కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా న్యాయవాదులు చొరవ చూపాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవ సందర్భంగా సంఘ కార్యాలయంలో చల్లపల్లి కి చెందిన మహిళా న్యాయవాది ఆరె దైవకృప ను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో ఏర్పడిన భారతీయ న్యాయ సంహిత ద్వారా సంక్రమించిన పలు సెక్షన్లపై ప్రజలకు కనీస అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బాలికలపై జరుగుతున్న ఆకత్యాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా అడ్డుకోవటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో చట్టాలు,శిక్షలు గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి న్యాయ వాదులు సామాజిక బాధ్యతతో చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మేడేపల్లి సుబ్బారావు,కర్రా లక్ష్మీ పాల్గొన్నారు.



మహిళ న్యాయవాదిని సత్కరిస్తున్న దృశ్యం

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబసభ్యులకు సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం దాలిపర్రు పంచాయతీలో ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తూ విద్యుత్ షాక్ కు గురై ఇటీవల మతి చెందిన చొప్పర వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు రూ.46 వేలు సేకరించి మతుని భార్య రాజేశ్వరికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి గుత్తికొండ కిషోర్, సర్పంచ్ దోకిపర్తి శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శులు బోలెం అర్జున్ రావు, పుట్టి రాంబాబు, చావల కాంతారావు, డిజిటల్ అసిస్టెంట్ తేజ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మతుని భార్య రాజేశ్వరి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గత ఐదేళ్ల పాలనలో భూఆక్రమణలు : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : వైసిపి గత ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలకు పాల్పడ్డారని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో వైసిపి నాయకులు ఆక్రమించిన భూముల విలువ రూ. 35,576 కోట్లకు పైగా ఉంటుందన్నారు. పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పదివేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9750 కోట్లు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపణల వర్షం కురిపించారు. పేదల ఇళ్ల స్థలాలు పేరుతో రైతుల వద్ద నుండి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసిన వైసిపి నాయకులు వాటిని ఎక్కువ ధర కు ప్రభుత్వానికి అమ్మి వేల కోట్ల రూపాయలు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో వైసిపి నాయకుల ఆక్రమించిన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. గత ప్రభుత్వ అక్రమాలపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు.

తాడంకిలో వ్యక్తి హత్య



ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని తాడంకి గ్రామానికి చెందిన గండికోట రాంబాబు (40) హత్యకు గురయ్యారు. పమిడిముక్కల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు అనుమానం ఉందని తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మొవ్వ : గతంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి 2011 భూ రైతుల చట్టాన్ని అమలు చేయాలని మొవ్వ గ్రామంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ ఆధ్వర్యంలో సంతకాలు సేకరిస్తున్నారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా, గ్రామ రెవెన్యూ అధికారులు కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు ఇవ్వాలని పంట రుణాలు, పంట బీమా, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందేలా చేయాలని శీలం నారాయణరావు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు కాకి రాజశేఖర్, ఎం వేణు, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, పలువురు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణగొంది కాల్వ పూడికతీత

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ సహకారంతో నాగాయలంక మండలంలోని పెదపాలెం గ్రామం నుండి సోర్ల గొంది వరకు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా పంటకాలువ పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. మూడేళ్లుగా సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ ప్రాంత రైతులు ఆ పంట కాలువ కు నీరు అందని పరిస్థితి ఏర్పడడంతో పర్ర చివర పెద్దగొడపాలెం, పుల్లయ్య గారిదిబ్బ, సోర్ల గొంది గ్రామాల్లో కాల్వ పూడిక కారణంగా కొద్దిపాటి నీటి ఎద్దడి వచ్చి నా రైతులు సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని అక్కడి రైతులు శ్రీనివాస్ దష్టికి తీసుకువెళ్లగా ఆయన సొంత ఖర్చులతో నాలుగు ప్రొక్లైన్లు సమకూర్చగా రైతులు దగ్గరుండి కాల్వ పూడిక తీస్తున్నారు. జరుగుతున్న పనులను శ్రీనివాస్ స్వయంగా పరిశీలించి కాల్వ పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేయించుకోవాలని, మరో అయిదారేళ్ల వరకు కాల్వ పూడిక తీయాల్సిన అవసరం లేకుండా పనులు పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట విక్కు ర్తి రాంబాబు పులిగడ్డ చంద్ర ఆ ప్రాంత రైతులు పాల్గొన్నారు


పంట కాలువల పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్, రైతులు

హామీలను నెరవేర్చడంలో కేంద్రం ప్రభుత్వం విఫలం : సిపిఎం

ప్రజాశక్తి-చల్లపల్లి : మతతత్వవాద బిజెపిని ఓడించటమే సిపిఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో మండల స్థాయి రాజకీయ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014లో యూపీఎ పాలనలో జరిగిన తప్పులను ఎండగడుతూ నాడు బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. కేంద్రంలో గత పది సంవత్సరాలుగా అధికారం వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి పాలన చేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనాన్ని వెనక్కిర ప్పిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు తీసేశారని దుయ్యబట్టారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వారు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. 2000 నోట్ల రద్దు వల్ల చిన్న పరిశ్రమలు కుదేలవ్వడంతోపాటు సామాన్య ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. డీజిల్ గ్యాస్ ధరలు అధికంగా పెరిగాయని విమర్శించారు. 2019 లో దేశంలో బిజెపిపై వ్యతిరేక పెరగడంతో మత కల్లోలాలు సష్టించి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. చంద్రబాబు ఎన్నికల ముందు సిపిఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చి జిపిఎస్ జీవో విడుదల చేయటంపై ఉద్యోగులు ప్రభుత్వం మండిపడుతు న్నారన్నారు. ప్రజా పోరాటాలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముందుగా తులతగా చల్లపల్లి నారాయణరావు, గుంటూరు బాపనయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ లర్పించారు ఈ శిక్షణ తరగతులలో జిల్లా పార్టీ నాయకులు పంచకర్ల రంగారావు, మండల పార్టీ కార్యదర్శి మధు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై. నరసింహారావు

కేసరపల్లిని పీడిస్తున్న చెత్త సమస్య

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీలో ఎక్కడ చూసినా చెత్తా చెదారమే కనిపిస్తోంది. అది ప్రజలను పట్టి పీడిస్తోంది. మురుగు కాల్వల్లో నీరు పారడం లేదు, దుర్గంధం వెదజల్లడంతో పాటుదోమలు ఉదతి చెందడంతో జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లలు అంటురోగాల భారిన పడు తున్నారు. పారిశుద్ధం అధ్వాన్నంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మురుగుతో నానా అగచాట్లు పడుతున్నారు. దళితవాడ, బిసి కాలనీ, చెంచులకాలనీ, వివిన్ పురం, సుందరయ్య కాలనీ ఏరియాల్లోని డ్రైనేజీలు చెత్తతో నిండిపోయాయి. మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తుందని జనాలు చెబుతున్నారు. ఇళ్ల లో వాడిన నీరంతా కాల్వలోకి వచ్చి పారకుండా నిలిచిపోతుంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో నీ రంతా రంగుమాని దుర్వాసన వస్తుందని చెప్పారు. దళితవాడ రోడ్డు లో ఎక్కడపడితే అక్కడ చెత్త వారే స్తున్నారు. పెద్ద చెరువు వద్ద చెత్తపారేస్తున్నారు. చెత్త వేయొద్దని అధికారులు చెబుతున్నా ఎవ్వరూ పట్టిం చుకోవడం లేదు. డంపింగ్ యార్డు లేదు. చెత్త కేంద్రం ఉన్నా ఉపయోగం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని అంటు న్నారు. ఏదేమైనా పంచాయతీలో అభివద్ధి పనులు జరగడంలేదని, కనీసం



పా రిశుద్ధమైనా పటిష్ఠం చేయడం లేదని జనాలు విమర్శిస్తున్నారు. 12 వేల జనాభా ఉన్న పంచాయతీలో పారిశుద్ధంపై తగిన శ్రద్ధ పెట్టకపోవడం పట్ల అందరూ నిరసన వ్యక్తం చేస్నున్నారు. వర్షా కాలం కావడంతో చెత్త, చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని లేకుంటే రోగాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఏకలవ్య జయంతి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గిరిజనులకు ఆరాధ్య దైవమైన ఏకలవ్యుని జయంతిని ప్రతిఏటా తొలి ఏకాదశి రోజున జరుపుకోవడం



సాంప్రదాయమని టిడిపి ఎస్‌టి విభాగం సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ తెలిపారు. విజయవాడ సింగ్‌నగర్‌లో బుధవారం ఏకలవ్యునికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గోవిందు రామకృష్ణ, బండి రాజేష్, గరిక రాజేశ్వరి, శ్రీరామ అజయ్ కుమార్, రమణబాబు పాల్గొన్నారు. **కంచికచర్ల:** స్థానిక ఇందిరా కాలనీలో ఏకలవ్య కార్యనిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, వార్డు సభ్యురాలు కావాటి ఉషారాణి, కావాటి రాంబాబు, మేచర్ల రాజా వంశీ, కట్టా తిరుపతిరావు, కట్టా బాబు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి మున్సిపాలిటీలోని బి కాలనీ, ఎస్‌టి కాలనీ, జాకీర్ హుస్సేన్ కాలేజీ రోడ్లలో ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చుట్టుకుదురు వాసు, అమ్మాజీ, చనుమోలు నారాయణ, మైలా సైదులు, రాగాల జమలయ్య, కంప కోటేశ్వరావు, సాకిరి వెంకట నరసయ్య, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని పాలేటి ఒడ్డున గల పంచాయతన క్షేత్రం (మఠం శివాలయం) పునర్నిర్మాణ పనులు



శరవేగంగా సాగుతున్నాయి. పునర్నిర్మాణానికి యాత్రికులు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. బుధవారం జగ్గయ్యపేట పట్టణానికి చెందిన మొరిశెట్టి హరికిషన్‌లాల్ రూ.1,11,116, ధారా ఆంజనేయులు రూ.51,116, హైదరాబాదుకు చెందిన పిల్లి కృష్ణప్రసాద్ రూ.25,116 విరాళాలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా పారిశుధ్య చర్యలు చేపట్టాయి. లక్ష్మీపురం, కాకర్ల, చిట్లేల గ్రామాల్లో పంచాయతీ విస్తరణ అధికారి వెంకటరత్నం ఆధ్వర్యంలో సచివాలయాల ఆరోగ్య కార్యదర్శులు, కార్మికులు మురుగు కాలువలు శుభ్రపరిచి దోమల పిచికారి చేశారు. నివాస గృహాల నడుమ నిల్వ ఉన్న వర్షపు నీరు, మురుగు నీటి మళ్లిం పుకు చర్యలు తీసుకున్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మండల పరిధిలోని కూనపరాజు పర్వ గ్రామంలో గ్రామపంచాయతీ సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయి గ్రామంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీనిని గమనించిన సర్పంచ్ వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసే కార్యక్రమం ప్రారంభించారు.

మంత్రి దృష్టికి వ్యాపారుల సమస్యలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు డూండి రాకేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి వ్యాపారుల సమస్యలను తీసుకెళ్లారు. ట్యాక్స్ పేయర్స్ ఫెలిస్టేషన్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి వ్యాపారస్తుని దగ్గరకు వెళ్లి వ్యాపార సంబంధ



విషయాలతో పాటు పన్ను వసూళ్లకు సంబంధించిన వివరాలను అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. అధికారులు పన్ను వసూళ్లు చేస్తే మరింత వ్యాపారస్తులు నష్టపోతారని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో జీఎస్టీ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశం తాత్కాలికంగా వాయిదా పడింది.

'డాక్టర్ విశ్వామిత్ర' చిత్రీకరణ ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం: శివ సాయి బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై శివరాం హీరోగా నటిస్తున్న చిత్రం డాక్టర్ విశ్వామిత్ర షుటింగ్ మండలంలోని బొర్రా గూడెం గ్రామంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య దేవస్థానంలో బుధవారం ప్రారంభమైంది. సౌమ్య, వీరంకి వెంకట నరసింహారావు, రామకష్ణ, రంగనాయకులు, బాలచందర్ తదితరులు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రామ్మోహన్రావు(గాంధీ) తొలి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ సాయి వెంకట్, కో డైరెక్టర్లు బాలచందర్, భార్గవ్ ముహూర్త షాట్ కు దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అక్కలగాంధీ మాట్లాడుతూ డాక్టర్ విశ్వామిత్ర మంచి విజయాన్ని అందుకోవాలని, శివరాం



ద్వారా మైలవరం పరిసర ప్రాంతాల్లోని వారు సినిమాలో నటిస్తున్నందుకు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కష్ణాజిల్లా ఉపాధ్యక్షులు బోలేశెట్టి శ్రీకాంత్, మండల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

బాలరాజు కుటుంబానికి ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టిడిపి సీనియర్ నాయకులు పరికల బాలరాజు కుటుంబాన్ని బుధవారం తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు పరామర్శించారు. బాలరాజు కుటుంబానికి టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు బెజవాడ శంకర్, జనసేన పార్టీ ఇన్చార్జ్ మనుబోలు శ్రీనివాసరావు, జంగా కిషోర్, మేకల జాన్ పాల్గొన్నారు.

కట్టలేరు పునరుద్ధరణ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి-గంపలగూడెం: గడిచిన మూడు రోజుల వర్షాలతో స్థానిక కట్టలేరు వంతెన డైవర్షన్ రహదారి మళ్లీ మునిగింది. దీంతో పలు గ్రామాల ప్రజల రాకపోకలకు



ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులను తిరువూరు శాసనసభ్యుడు కె.శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాల ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడుతూ ప్రజలకు ఆటంకం కలగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రేగళ్ల వీరారెడ్డి, సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు పాల్గొన్నారు. పెద్ద కొమెర గ్రామ మాజీ సర్పంచ్ ఇనుగంటి రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

నేడు మున్నేరు నుంచి సాగునీరు విడుదల

ప్రజాశక్తి-వత్సవాయి: పోలంపల్లి మున్నేరు నుండి సాగునీటిని గురువారం శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య సాగునీటిని విడుదల చేయనున్నారు. పోలంపల్లి మున్నేరు ఆయకట్టు కింద 25 వేల ఎకరాలు సాగవుతుంది పత్తి, మిర్చి, మొక్కజొన్న, కంది, పెసర, ముఖ్యంగా వరి పంటలు సాగవుతున్నాయి. ఈ ఆయకట్టు కింద వత్సవాయి, పెనుగంచిప్రోలు, కంచికచర్ల మండలాల వరకు సాగునీరు అందిస్తున్నారు. గత సంవత్సరం అక్టోబర్, నవంబర్ మాసాల్లో కురిసిన వర్షాలకు గండ్లు పడటంతో పూడ్చి సాగునీటిని నిల్వ చేసి వరి పైర్లకు అందించారు. కోత దశలో వచ్చేంత వరకు పోలంపల్లి నుండి సాగునీటిని అందించారు. దీంతో ఆ సంవత్సరం రైతులు అష్టకష్టాలు పడ్డారు. మరికొంత మంది రైతులు బోర్ల సహాయంతో, మోటార్ల సహాయంతో, ఆయిల్ ఇంజన్ల సహాయంతో వరి పంటలను దక్కించుకున్నారు. జనవరి ఫిబ్రవరి మాసాల్లో కురిసిన వర్షాలకు పోలంపల్లి డ్యాం వద్ద మరలా గండ్లు పడ్డాయి. ఈ సంవత్సరం జూలైలో కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద గండ్ల ద్వారా దిగువకు చేరి లింగాల మునేరు నుండి కీసరకు వెళ్లిపోతున్నాయి. దీంతో స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెనుగంచిప్రోలు, కంచికచర్ల మండలాల రైతులతో చర్చలు జరిపి సాగునీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పెదమండవ రైతులకు నష్టపరిహారం కూడా అందించారు. గండ్లు పడ్డ ప్రదేశాలను పరిశీలించి ఆ గండ్లను పూడ్చి సాగునీటి నిల్వ చేసి గురువారం వరి నారుమడలకు సాగునీరు అందించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి-భవానీపురం: పున్నమి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కె.వి. శంకర మఠం విద్యుత్తు లైన్ మరమ్మత్తుల కారణంగా ఈ నెల 18 వ తేదీ గురువారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు జొన్నవిత్తుల వారి వీధి, శంకర మఠం, పార్థసారధి వీధి, గురుకప రోడ్, టి.వి. కష్ణరావు వీధి, గుప్తా సెంటర్ డౌన్, షాదీ ఖానా ఏరియా, అండమాను బ్రహ్మయ్య వీధి, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, బుద్దా వారి వీధి, కే.సి స్కూల్ రోడ్, అరవింద వీధి మరియు సిమెంట్ రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యవస్థలను భ్రష్టుపట్టించిన వైసిపి : బుద్ధా

ప్రజాశక్తి-వన్‌టౌన్: గత వైసిపి ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి పాలనపై, మాజీ సిఎం జగన్‌పై మండిపడ్డారు. ప్రజలు ఎన్నికల్లో వాతలు పెట్టినా జగన్మోహన్‌రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదన్నారు. పోలవరం పూర్తి చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు పర్యటన చేస్తున్నారని, గత ప్రభుత్వం పరిపాలన ఎలా చేసిందో చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందని, అందుకే శ్వేతపత్రాల ద్వారా విషయాలను ప్రజలకు తెలియజేస్తున్నారని వివరించారు. జగన్ ఐదు సంవత్సరాలు పాటు రాష్ట్రాన్ని చెత్తగా మార్చేశారని, ఆ చెత్తంతా చంద్రబాబు క్లీన్ చేస్తున్నారని, 35 రోజుల్లోనే ఆ చెత్త అంత క్లీన్ అయిపోతుందా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు ఢిల్లీ టూర్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికీ ప్రజలు వైసిపినిఅసహ్యించుకుంటున్నారని, ఆ 11 సీట్లు ఎందుకు ఇచ్చామా అని ప్రజలు ఆలోచిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కామా దేవరాజు, కొట్టేటి హనుమంతరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), తుపాకుల వెంకటేశ్వర్లు, బి.నందకుమారి, పేరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




బోరు పంపులను బాగు చేయాలి : సత్యబాబు



ప్రజాశక్తి-వన్‌టౌన్: 50వ డివిజన్‌లో పాడైపోయిన బోరు పంపులను బాగుచేసి అందుబాటులోకి తేవాలని స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్ పర్యటనలో భాగంగా మహంతిపురం, గొల్లపాలెం గట్టు, క్వారీ, ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు పాడైపోయిన బోరింగ్ పంపులను రిపేర్లు చేయవలసిందిగా కార్పొరేటర్ బోయి సత్యబాబు వద్ద మొరపెట్టుకున్నారు. 5 ఎంజీడి ప్లాంట్ క్లీనింగ్ చేయుట వలన మహంతిపురం, వించిపేట 170, 176, 177 సచివాలయం ప్రాంతాల్లో మంచినీటి సరఫరా 18వ తేది సాయంత్రం నిలుపుదల చేయడం జరుగుతుందని మున్సిపల్ అధికారులు తెలియపరచారని ఈ విషయమై ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలియపరచడం జరిగింది. నీటి సరఫరా ఆటంకం కలిగే పరిస్థితుల్లో పాడైపోయిన బోర్లు వెంటనే బాగు చేస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు కొంత ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఈ అంశం పై ఈనెల 10వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎజెండా ద్వారా ప్రతిపాదించి చర్చించడం ఆమోదించడం జరిగిందని తెలిపారు కావున మున్సిపల్ కమిషనర్ వెంటనే డివిజన్లో పాడైపోయిన బోరింగులు మరమ్మతులు చేయించేందుకు తగు చర్యలు చేపట్టాలని సత్యబాబు విజ్ఞప్తి చేశారు. వాటర్ సప్లై విభాగంలో తగినంత సిబ్బంది లేక నెలలు తరబడి బోరింగ్ రిపేర్లు చేయడంలో జాప్యం జరుగుతుందని వెంటనే సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు.



డిపోకు శంకుస్థాపన చేసిన అప్పటి శిలాఫలకం



మూసివేత దిశగా

ఉయ్యూరు ఆర్‌టిసి డిపో..?

- ఇతర డిపోలకు తరలిస్తున్న బస్సులు
- నష్టాల సాకు చూపిస్తున్న అధికారులు

ప్రజాశక్తి ఉయ్యూరు : ఉయ్యూరు ఆర్టీసీ డిపో మూసివేత దిశగా అధికారులు స్పీడుగా స్టీరింగ్ తిప్పుతున్నారు. ఉయ్యూరు, పరిసర మండలాల ప్రజలతో పాటు జిల్లా ప్రజల సౌకర్యార్థం రవాణా సౌకర్యం కల్పించాలన్న మహోద్దేశంతో 1986 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఉయ్యూరులో బస్ స్టాండ్, బస్సుడిపోకు శంకుస్థాపన చేశారు.


1991లో డిపోనుండి బస్సుల రాకపోకలు ప్రాంరంభమైనప్పటి నుండి పొరుగు మండలాలతో పాటు జిల్లా, పొరుగు గ్రామాలకు బస్సులు నడిపి ప్రయాణికులకు చక్కటి రవాణా సౌకర్యం కల్పించారు. తదుపరి పరిస్థితుల్లో డిపోకు నష్టాలు వస్తున్నాయని 2006లో ఉయ్యూరు, గన్నవరం, డిపోలు మూసివేసి 2010లో తిరిగి డిపోను ప్రారంభించి 333 నంబరు పామర్రునుండి కాళేశ్వరరావు మార్కెట్, జిల్లా ముఖ్య పట్టణం మచిలీపట్నం, అవనిగడ్డ, భీమవరంతో పాటు పలు ప్రాంతాలకు బస్సులు నడిపి డిపో ను లాభాల బాటలో తీసుకువచ్చారు. తరువాత డిపో పట్ల ఆర్టీసీ అధికారులు చిన్న చూపు చూసి లాంగ్‌రూట్ బస్సులు ఇతర డిపోలకు కేటాయించి ఒకటి రెండు పల్లెవెలుగు, హైదరాబాద్ బస్సులు మినహా మిగిలినవన్నీ 222 నంబరు సిటీ బస్సు లుగా ఉంచి సిటీబస్ డిపోగా తయారుచేశారు. ఈక్రమంలో ఉన్న బస్సులతో కార్మికులు, ఉద్యోగుల కషితో 2022 వరకు జిల్లాలో ప్రధమ, జోన్లో 6వ స్థానంలో ఉత్తమ డి పోగా ఉన్న పరిస్థితుల్లో ఉన్నతాధికారులు చిన్నచూపు, ఇతర డిపోల బస్సుల అక్రమ చొరబాటుతో ప్రస్తుతం రాష్ట్రంలో 129వ స్థానానికి చేరుకుంది. డిపో పరిధిలోకి నిబంధనలకు విరుద్ధంగా ఇతర డిపోల బస్సులు యధేచ్ఛగా తిరుగుతూ డిపో ఆదాయానికి పెద్ద యెత్తున్న డిపో ఆదాయానికి గండికొడుతున్నా డిపో అధికారి పట్టనట్టు వ్యవహరిస్తూ కిమ్మన కుండా చూస్తూ ఊరుకుంటున్నారని సిబ్బంది వాపోతున్నారు. అయిన ప్పటికి కాలం చెల్లిన, ఎక్కడ ఆగిపోతాయో తెలియని స్థితిలో ఉన్న బస్సులతో డిపో నెట్టుకొస్తుంటే ఉన్నవాటిలో కొన్నిబస్సులు గుడివాడ, విజయవాడ డిపోలకు తరలించారు. దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీలు లేకుండా పీపీసీలు పెట్టి సెలవులు ఇసున్న పరిస్థితి నెలకొంది.

విజయవాడసిటీ పరిధిలో పోరంకి వరకు తిరగవలసిన ఇబ్రహీంపట్నం డిపో నుండి 1 వ నంబరు బస్సుల సంఖ్య పెంచి ఉయ్యూరు డిపో పరిధిలో కంకిపాడు వరకు, అదేవిధంగా 150 నంబరుతో తిరిగే బస్సుల సంఖ్య పెంచి తిప్పుతున్నారు. అదే విదంగా విద్యాధరపురం, గవర్నర్పేట2 డిపోకు చెందిన మెట్రోబస్సులు సిటీ పరిధిలో కాకుండా అన్నీ 333 నంబరుతో పామర్రు, జిల్లాలో ఇతర గ్రామాలకు నిబంధనలకు, లెక్కకు మించి ట్రిప్పులు తిప్పుతూ ఉయ్యూరు డిపో ఆదాయానికి గండిగకొడుతున్నా స్థానిక అధికారికి చీమకుట్టినట్టయినా లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. టోల్ గేట్ సమ స్యకూడా డిపోను నష్టాల బాటలోకి నెడుతుందని 222 నంబరుతో కాళేశ్వరరావు మార్కెట్కు వెళ్లే బస్సులు ఒక్కొంకటికి రోజుకు వెయ్యి రూపాయల పైన చెల్లించాల్సి రావడం ఈబస్సుల్లో టోల్‌గేట్ చార్జి కేవలం ఓప్రయాణికుడి నుండి రూ. 5 వసూలు చేస్తుండగా 333 మెట్రోబస్సులు రూ.10 వరకు వసూలు చేస్తున్నాయి. రద్దీగా ఉండే సమయంలో తప్ప మిగిలిన సమయంలో ప్రయాణికులు లేక టోల్ గేట్కు కట్టే డబ్బు కూడా రాకపోవడంతో డిపో చేతినుండి కట్టవలసి వస్తుంది. బస్సులు లేక ఇప్పటికే కంకిపాడు - గన్నవరం, ఉయ్యూరు- గుడివాడ, ఉయ్యూరు- ద్వారకాతిరుమల, కుందేరు వెళ్లే సర్వీసులు తగ్గించి వేశారు. కొత్త సర్వీసులు వస్తున్నాయని చెబుతున్న డిపో మేనేజర్ బస్సులు లేకుండా కొత్తరూట్లలో ఎలా నడుపుతారని ప్రశ్నిస్తే ఉన్న సర్వీ సులు ఆపి ఆరూట్లలో నడుపుతామని పొంతన లేని వివరణ ఇవ్వడం విశేషం.

డిపోమూసివేత అపోహలే
కెవీఎస్ ప్రసాద్, డిపో మేనేజర్

డిపోమూసివేస్తారన్నది అపోహ మాత్రమే. కొత్త సర్వీసులు వస్తున్నాయి. ఇతర డిపోలకు వెళ్లిన బస్సులు కూడా వస్తాయి.

కుళాయిల్లో మురుగునీరు



ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని వెంకట నరసింహాపురం కాలనీలో గత రెండు రోజులుగా నీరు కుళాయి నీళ్లలో మురుగు నీరు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. నీరు దుర్వా సనతో నల్లగా, నురుజుతో నీళ్ళు వస్తున్నాయని అంటు న్నారు. ఇప్పటికే ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో డయేరియాతో ప్రజలు ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాంతం ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జంగిల్ క్లియరెన్స్‌లో పాల్గొన్న నాయకులు

ముళ్ల కంచెలు తొలగింపు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని మెరకగౌడ పాలెం వంతెన సెంటర్ నుంచి ద్వారక సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ళ చెట్లు కొమ్మలు జెసిబి సహాయంతో తొలగించే కార్యక్రమానికి కోడూరు మండలం జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం శ్రీకారం చుట్టారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఉల్లి శేషగిరి, యువ నాయకుడు బచ్చు వెంకటేష్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో ముద్దినేని చంద్రరావు, కోట రాంబాబు, బచ్చు వెంకటేష్ ఫ్రెండ్ సర్కిల్ పాల్గొన్నారు.

'స్పందన' సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రాంతంలో స్పందన మానసిక వికాస కేంద్రం ఉండటం మనందరికీ గర్వకారణమని టిడిపి నాయకులు వీర బత్తిన అమల్ దాస్ అన్నారు. గన్నవరం మండలం దావాజిగూడెంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రాన్ని దాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమల్ దాస్ మాట్లాడుతూ గన్నవరం మండలం దావాజిగూడెంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో వికలాంగుల కొరకు స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాలు వంటి సదుపాయాలు కల్పించడమే కాకుండా ఒకేషనల్ ట్రైనింగ్లో భాగంగా బొకేస్, గాజులు, దండలు తయారీ, కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అలాగే ఎంతోమంది వికలాంగుల పది, ఇంటర్మీడియట్, ఇత ఉన్నత చదువులకు ప్రోత్సాహం అందిం చడం గొప్ప విషయని ఆయన అన్నారు. పేదలకు, వద్ధులకు, వితంతు వులకు, విద్యార్థులకు అండగా నిలవడం ఆపద సమయంలో రక్తం అవసరమైన సమయంలో బ్లడ్ ఏర్పాటు చెయ్యడం అత్యద్భుతమని కొనియాడారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని వల్లూరు పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ తల్లికి బుధవారం యార్లగడ్డ ఏసుబాబు దంపతుల ఆధ్వర్యంలో ఆషాడం చీర సరే సమర్పించారు. అన్న ప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు.పెద్ద ఎత్తున మహిళలు, యువత, గ్రామస్తులు పాల్గొని గంగానమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో పూజించారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - గుడివాడ : చేనేత హస్తకళలను ప్రోత్సహించి వారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని భావనాఋషి చేనేత హస్తకళా కార్మిక సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్‌లూమ్, హ్యాండి క్రాఫ్ట్స్ ప్రదర్శన, అమ్మకాలను మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న డ్వాక్రా, చేనేత హస్తకళాకారులు తయారు చేసిన అమ్మకాలు అతి తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణ్‌పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ ఖాధీ, కాటన్ ప్రింటేడ్ బెంగాల్ సిల్క్, తదితర ప్రాంతాల నుండి వచ్చిన చేనేత కార్మికులు తయారు చేసిన వాటిని కోనుగోలు చేసి వారిని అదుకోవలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు సింహద్రి, సురేష్, నాయకులు లోయ నాని, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదలపై హర్షం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్ష ద్వారా రాష్ట్రంలో సుమారుగా 25 వేల మంది కి పైగా కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ పార్ట్ టైం కేజీబీవీల వంటి విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మే , జూన్ నెల కు సంబంధించిన బడ్జెట్ విడుదల చేయడం పట్ల రాష్ట్ర పిటిఐ సంఘ అధ్యక్షులు సి.హెచ్.ఎన్. దేవేంద్ర రావు ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు. వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ని విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి బి. శ్రీనివాస్ లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రతి నెల ఒకటవ తేదీ నే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడి సాయం తక్షణమే అందజేయాలి

ప్రజాశక్తి -గుడివాడ : ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు, కౌలు రైతులకు ఇస్తానన్న రూ. 20 వేలు పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన తుఫాన్ నష్టపరిహారం వెంటనే ఇవ్వాలన్నారు. వ్యవసాయ విద్యుత్ మీటర్ల రద్దు చేయాలన్నారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా బుధ, గురు వారాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతి రైతు పాల్గొని సమస్య లను తెలియా జేయాలని, వాటిపై రైతు సంఘం పోరా టం చేస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా నాయ కులు నీలం మురళీ కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యు లు ఎన్‌వి కృష్ణారావు, బివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకర్లుతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నీరు విడుదల

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకవర్గంలో శ్రీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రాఘవాపురం- కమ్మవారిపాలెం లో సాగు నీటిని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విడుదల చేశారు.శ్రీ సీతారామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద పూజలు నిర్వహించి రాఘవాపురం - కమ్మవారిపాలెం పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. జగన్ పాలనలో అసమర్థ, అవినీతి, చేతగాని నాయకులు ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేశారని తంగిరాల సౌమ్య విమర్శించారు. ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మండల పార్టీ నేతలు, రైతులు పాల్గొన్నారు.



నేరాల నివారణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని సెక్యూరిటీ కాలనీలో ఇబ్రహీంపట్నం సిఐ ముత్యాల సత్యనారాయణ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మరియు చిన్నారులపై జరుగుతున్న ఆకత్యాలపై, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలపై కాలనీవాసులకు అవగాహన కలిగించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. డ్రగ్స్ మరియు గంజాయికి బానిసలై యువత తమ అమూల్యమైన జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారన్నారు. అటువంటి మత్తు పదార్థాలకు బానిసలైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

శాంసంగ్ 'జెడ్' బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, గెలాక్సీ ఏఐ స్మార్ట్ ఫోన్లు ముందస్తు బుకింగ్స్ ప్రారంభించినట్లు షోరూం మేనేజర్ ఎం.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్లు.. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ ల కోసం ముందస్తు బుకింగ్ లను తెరిచినట్లు తెలిపారు. కొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ గెలాక్సీ ఏఐని నూతన శిఖరాలకు తీసుకువెళ్లనున్నాయిఅని అన్నారు.. వినియోగదారులకు ప్రత్యేకమైన మొబైల్ అనుభవాల శ్రేణిని అందిస్తాయి అన్నారు.. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ కోసం ముందస్తు బుకింగ్ ఈ నెల 10 నుండి అన్ని ప్రముఖ ఆన్లైన్, ఆఫ్లైన్ రిటైల్ స్టోర్లలో ప్రారంభమైందని, వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఒప్పో రెనో 12 విడుదల

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: రెనో 12 సిరీస్‌ను విడుదల చేస్తున్నట్లు ఒప్పో ఇంఛార్జి ఎస్.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు, దేశంలో ఏఐ ఫోన్‌ల లభ్యతను వేగవంతం చేసే దిశగా తొలి అడుగు వేసింది. అన్నారు. రెనో 12 సిరీస్ నిత్యం మీకు తోడుండే ఏఐ. ఇది క్లిష్టమైన ఇమేజ్‌లను ఎడిటింగ్ లేకుండా ఫన్నీ ఫోటోలను అందించేందుకు ఏఐ ఎరేజర్ 2.0, ఏఐ క్లియర్ ఫేస్, ఏఐ బెస్ట్ ఫేస్, స్మార్ట్ ఇమేజ్ మ్యాటింగ్ 2.0వంటి ఫీచర్లను కలిగి ఉంది అని తెలిపారు. ఈ పరికరాలు రోజువారీ ఉత్పాదకతను పెంచడానికి ఏఐ రైటర్, ఏఐ సమ్మరీ, ఏఐస్పీక్‌లను కలిగి ఉన్న గూగుల్ జెమిని ఎల్ఎల్ఎం ఆధారితమైన ఏఐ టూల్‌బాక్స్‌ను కూడా కలిగి ఉంటుంది అని తెలిపారు. రెనో 12ప్రో 5జీ రెండు వేరియంట్‌లలో అందుబాటులో ఉంటుందన్నారు.

జీవనరాగాలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ: తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురస్కార గ్రహీత శ్రీ తుర్లపాటి నాగభూషణరావు నాగరాజు రచన చేసిన 'జీవన రాగాలు' పుస్తకాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. బుధవారం నందిగామ పట్టణం 13వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తెలుగు భాషా రత్న జీవన సాఫల్య పురస్కార గ్రహీత తుర్లపాటి నాగభూషణరావు స్వయంగా రచించిన జీవన రాగాలు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం నిజంగా అదృష్టమన్నారు. తానా ప్రపంచ సాహితీ సభలలో పాల్గొంటున్న వారికి ఈ సందర్భంగా ఆత్మీయ సత్కారం చేసుకోవడం గొప్ప విషయమన్నారు. ని అందునా నాగభూషణ రావు ఈ నియోజకవర్గంలో రావులపాడు కు చెందిన వారు కావడం మన ప్రాంత అదష్టముగా భావించవచ్చు అన్నారు. స్వర్గీయ తంగిరాల ప్రభాకర్ రావు కు సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువ అని ఆయన సంపాదనలో అధిక శాతం పుస్తకాలకే ఖర్చు చేసే వారంటంలో అతిశయోక్తిలేదని ఈ సందర్భంగా వివరించారు.

ప్రజారోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి : కొలికపూడి

ప్రజాశక్తి ఎ.కొండూరు: విష జ్వరాలు బారిన పడిన వారిని నిత్యం పర్యవేక్షిస్తూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వైద్యాధికారులకు సూచించారు. బుధవారం ఆయన ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఎ.కొండూరు అంబేద్కర్ కాలనీలో వైద్యాధికారులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యాధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు జ్వరపీడుతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారికి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని, అన్ని రకాల మందులు కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎంతమంది జ్వరాలతో బాధపడుతున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ లక్షణాలు కలిగి ఉన్న వారిని వెంటనే విజయవాడ గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. గ్రామాల్లో గహాల వెంబడి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎంపీడీవో శ్రీకష్ణ పరమాత్మను ఆదేశించారు. అలానే గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, పారిశుధ్యం పై దష్టి సారించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని ప్రజలు కూడా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. జ్వరాలు సోకినప్పుడు అశ్రద్ధ చేయకుండా స్థానిక పీహెచ్ సి కి వెళ్లి డాక్టర్ సలహాలు పాటించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి తక్షణమే వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుహాసిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, స్థానిక పీహెచ్ సి డాక్టర్లు, వైద్య సిబ్బంది, మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కష్ణారెడ్డి, తిరువూరు మాజీ ఏఎంసీ ఛైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ వాసం మునియ్య, వనపర్ల డేవిడ్ రాజు, తిరువూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

ప్రతిఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి : వెంకట్రావు



మాట్లాడుతున్న వెంకట్రావు

ప్రజాశక్తి-తిరువూరు: శాస్త్రీయ దృక్పథం అనేది కేవలం సైన్స్‌కు మాత్రమే పరిమితం కాదని, సామజిక శాస్త్రాలకు కూడా ఇది వర్తిస్తుందని ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్, సామాజిక విశ్లేషకులు ఎస్.వెంకట్రావు అన్నారు. తిరువూరు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జెవివి ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం-ఆవశ్యకత అనే అంశంపై జెవివి మండల అధ్యక్షులు మోదుగు సుధాకర్ అధ్యక్షతన బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రయోగం, పరిశీలన అనంతరం ఆధారాలతో రుజువు అయిందే శాస్త్రీయ దృక్పథం కిందకు వస్తుందన్నారు. అటువంటి విషయాలనే నమ్మాలన్నారు. పాలకులే పనిగట్టుకుని తమ ఉనికి కోసం ప్రజల్లో మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తనదైనందిన జీవనాన్ని సైన్స్ పద్ధతిలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. శాస్త్రీయ దృక్పథంతోనే పని చేయాలని, ప్రతి దానికి ఒక శాస్త్రీయ దక్పథం ఉందని ప్రధానమంత్రి నెహ్రూ కూడా చెప్పిన విషయాన్ని వెంకట్రావు గుర్తుచేశారు. జెవివి వంటి సైన్స్ సంస్థలు ప్రజారోగ్యాన్ని కాపాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే ప్రచారాన్ని విస్తృతంగా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వి.రవీంద్ర, ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, నాయకులు ఎం.హరికృష్ణ, ఎం.సుధాకర్, డి.సుదర్శన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బూడిద సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని బూడిద చెరువు నుండి నిత్యం వందలాది లారీలు కనీస నివారణ చర్యలు చేపట్టకుండా ఇష్టారాజ్యంగా బూడిదను రవాణా చేస్తున్నాయని, వాటి ద్వారా స్థానికంగా ఉన్న ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య ను కాలుష్య నివారణ పోరాట సమితి సభ్యులు కోరారు. బుధవారం సీతారామయ్య కార్యాలయంలో కలిసి పరిమితికి మించి వేగంతో, అధిక లోడుతో, బూడిదను కార్చుకుంటూ, లారీలు రోడ్డు వెంట వెళ్తున్నాయని, దానివల్ల బూడిద రోడ్డు మీద పడి వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. కొన్ని సమయాల్లో ప్రాణాపాయం కూడా సంభవిస్తుందన్నారు. సమస్యను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కషి చేస్తానని, బూడిద వల్ల కలిగే నష్టాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరీముల్లా, హైదర్, రఫీ, భవాని, మాధురి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో 'విరాజీ' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విరాజీ చిత్ర బృందం విజయవాడలో సందడి చేసింది. విరాజీ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మొగల్రాజపురంలోని ఒక హక్షటల్లో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ఒక డిఫరెంట్ కథతో డిఫరెంట్ లుక్కుతో ఆగస్టు రెండున విరాజి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చెప్పారు. దర్శకుడు ఆధ్యంత్ హర్ష చెప్పిన కథ విన్న వెంటనే చిత్రంలో హీరోగా నటించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. విజయవాడ నగరం నుంచి చిత్ర ప్రమోషన్ ప్రారంభించామని, ఇప్పటివరకు ఏ హీరో చేయని మాదిరిగా విరాజీ చిత్రంలో తాను నటించిన క్యారెక్టర్ ను ప్రేక్షకులకు తెలియజేసేందుకు అదే గెటప్పుతో ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలియజేశారు..ఈ చిత్రంలో అన్ని రకాల అంశాలు ఉంటాయని కుటుంబ సమేతంగా విరాజి చిత్రాన్ని వీక్షించ వచ్చని తెలిపారు. దర్శకుడు హర్షకు ఈ చిత్రం మొదటి చిత్రం అయినా కూడా ఒక సీనియర్ దర్శకుడు మాదిరిగా చిత్రాన్ని అద్భుతంగా తీశారని వివరించారు. తన 17 ఏళ్ల కెరియర్లో ఇప్పటివరకు చేయని ఒక విభిన్నమైన క్యారెక్టర్ ను ఈ చిత్రంలో చేయడం జరిగిందని ఈ క్యారెక్టర్ ప్రేక్షకులకు అమితంగా నచ్చుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో హీరోయిన్ ఉండదని కేవలం నటీనటులు మాత్రమే ఉంటారని చెప్పారు. ఆగస్టు రెండున తమ చిత్రం విడుదల కానుందని తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నటీమణులు అపర్ణాదేవి, కుషాలిని పాల్గొన్నారు.





ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి-కంచికచర్ల: ఇసుక పంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటే తగు చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ హెచ్చరించారు. నందిగామ డివిజన్ పరిధిలోని కంచికచర్ల మండలం కీసర గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ యార్డును బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇసుక స్టాక్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. ఇసుక రవాణా, లోడింగ్, తదితర అంశాలను ఆయన స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఇసుక స్టాక్ యార్డ్ లో జరుగుతున్న అంశాలను స్థానిక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఇసుక పంపిణీ పారదర్శకంగా జరగాలని తగు సూచనలు చేశారు. జెసి వెంట డిప్యూటీ తాసిల్దార్ షేక్ నాగుల్ మీరా, ఎస్ ఈ బీ సీఐ సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయ సుబ్రహ్మణ్యం బాల శంకర్రావు, కంచికచర్ల ఎస్సై సుబ్రహ్మణ్యం, ఆర్ ఐ సుబ్రహ్మణ్యం, మైనింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మండల లీగల్ సర్వీస కమిటీ ఛైర్ పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే.శ్రావణి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 గంటల నుండి గంటల వరకు జగ్గయ్యపేట కోర్టు కాంపౌండ్ నుండి జగ్గయ్యపేట ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ వరకు ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు, పోలీసులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

గొట్టుముక్కలలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కంచికచర్ల: గొట్టుముక్కల గ్రామంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడంపై సర్పంచ్ తుల్లి మల్లి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ గోగినేని అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శి వనిత పర్యవేక్షణలో జెసిపి సహాయంతో వర్షపు నీరు ప్రవహించడానికి వీలుగా రహదారులకు ఇరువైపులా కాలవలు పూడిక తీయించారు. మురుగునీరు ప్రవహించడానికి వీలుగా కాలువలు శుభ్రం చేయించారు. వీధుల వెంట సున్నం, బ్లీచింగ్ చల్లించారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని స్థానిక కొనేరుసెంటర్‌లో మొహరం సందర్భంగా బుధవారం ముస్లిం సోదరులు చెస్ట్ బీటింగ్ నిర్వహించారు. కార్బలా యుద్ధంలో మహ్మద్ ప్రవక్త మనమడు హుస్సేన్‌తో పాటు ఆయన అనుచరులు వీరమరణాన్ని గుర్తు చేసుకుంటూ రక్తతర్పనం చేసారు. గిరోహే హుసైన్ (ఏఎస్) ఆధ్వర్యములో స్థానిక చింతచెట్టు సెంటర్ బార్గాయె హుసైనే నుండి ఊరేగింపు బయలుదేరి కోనేరు సెంటర్‌లో చెస్ట్ బీటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి, సీ ఐ ,మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాజా నాయకులు కర్బలా అమరవీరులకు నివాళులు ఆర్పించి అలంకు ధట్టి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరోహే హుసైన్ (ఎ ఎస్) జనరల్ సెక్రెటరీ అలందార్ హుసైన్, ప్రెసిడెంట్ యం గులామ్ హైదర్, ట్రెజరర్ యం.అబ్బాస్ పాల్గొన్నారు. అలాగే మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ మొహర్రం సందర్భంగా ముస్లిం సోదరులకు సంఘీభావాన్ని ప్రకటించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : మంచిని పెంచడానికి మానవత్వానికి మొహరం నిదర్శనం అని పలువురు ముస్లిం నాయకులు కొనియాడారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ వర్ధంతి సందర్భంగా పమిడిముక్కల మండలంల అలినాకి పాలెంలో ముస్లింలు చెస్ట్ బీటింగ్ బుధవారం నిర్వహించారు. జాఫర్ ఆలీ అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : మొహరం పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఉరేగింపును బుధవారం పట్టణంలోని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముజవర్, సయ్యద్ ఆరిఫ్, నాజీమున్నిసా, ఖాసీం, అహమ్మద్ బేగ్, అబ్దుల్ అలీమ్, షేక్ నవాబ్, జానీలు మాట్లాడుతూ మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అన్నారు. రక్తతర్పణ చేయడం మనమానవజాతి త్యాగమాని, త్యాగాన్ని గుర్తు చేసుకోవటమే ఈ పండుగ ప్రత్యేకతని తెలిపారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మొహరం పండుగను మండ లంలో కౌతరం, డోకిపర్రు, కట్టమని చెరువు, ఉలవల పూడి, అంగలూరు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పీరీలతో ఆయా గ్రామాల్లో ఊరేగించారు.



మచిలీపట్నంలో...



పమిడిముక్కల మండలంలో..

27న కెఎల్‌యులో సిల్వర్‌జూబ్లీ వేడుకలు



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో చదివిన 1995-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల 2024 అధికారిక పోస్టర్‌ను బుధవారం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్ శ్రీకావ్య తదితరులు ఆవిష్కరించారు. సిల్వర్ జూబిలీ వేడుక ఈ నెల 27న జరగనుందని పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శ్రీకావ్య తెలిపారు. ఈ సిల్వర్ జూబిలీ వేడుక యూనివర్సిటీ లోని పూర్వ విద్యార్థుల సంబంధాల విభాగంచే నిర్వహింపబడుతుందని పేర్కొన్నారు. సిల్వర్ జూబిలీ వేడుకలో 1995-99 బ్యాచ్ కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం పూర్వ విద్యార్థులలో స్నేహభావాన్ని పెంపొందించి గత జ్ఞాపకాలను నెమరు వేసుకో వడానికి స్ఫూర్తిని పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో పలు ఆకట్టుకునే కార్యక్ర మాలు, నెట్‌వర్కింగ్ సెషన్లతో పాటు పూర్వ విద్యా ర్థులకు వర్సిటీతో ఉన్న బంధాన్ని బలపరచడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ వేడుక కేఎల్ యూని వర్సిటీకి మరో మైలురాయిగా అభివర్ణించారు. దీంతో పాటు పూర్వ విద్యార్థులతో జీవితాంతం సంబంధాలను కొనసాగించడం, వారి నిరంతర అభివృద్ధికి తోడ్పడడానికి ఎంత గానో ఉపయోగ పడు తుందన్నారు. ఉద్యోగ కల్పనల డైరెక్టర్ డాక్టర్ ఎం. వెంకట నారాయణ, ఇంజనీరింగ్ కళాశాల వైస్-ప్రిన్సిపల్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్ పాల్గొన్నారు.

సహజవనరుల దోపిడీని అరికడతాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో అసాంఘిక కార్యక్రమాలు సహజ వనరుల దోపిడీని అరికట్టడమే తన ధ్యేయమని ఎంఎల్‌ఎ బుద్ధ ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక మట్టి బుసక దోపిడీ జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆరోపణ చేయడం కాకుండా అటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఫిర్యాదులు చేయాలని హితవు పలికారు. గత ఐదు సంవత్సరాలుగా విచ్చలవిడిగా జరిగిన దోపిడీని అనైతిక కార్యకలాపాలను ఒక్కరోజులో అరికట్టలేమని గతంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలను చూసి చూడనట్లు వ్యవహరించిన అధికారులలో మార్పు రావాల్సి ఉందన్నారు. అవనిగడ్డలో ఈ నెల 18 నుంచి మొదలుకానున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని జనసైనికులు అందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కోరారు.

ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మంగళగిరి :ఏకలవ్య జయంతి సందర్భంగా మంగళగిరి పట్టణం నాంచారమ్మ చెరువులో పట్టణ ఏపీ ఏరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ. పేరం ఏడుకొండలు పాల్గొ ని మాట్లాడతూ ఏకలవ్యుని పట్టుదల అకుంఠిత దీక్ష గురుభక్తి కలిగి ఉన్నగొప్ప వీరుడు ఏకలవ్యుడు అని అన్నారు. మహాభారతంలో వీలువిద్య నేర్పమని ద్రోణుని అడిగిన అతను కుల దుర అహంకారంతో నేర్పనని చెప్పటం, అతని బొమ్మని పెట్టుకుని అకుంటీత దీక్షతో, పట్టు వదలని విక్రమార్కు డిలా, విల్లువిద్యను నేర్చు కొనినాడు, కార్యక్రమంలో పాలపర్తి మోజేష్, నల్గొండ తాతారావు, దాసరి గోపి, ఉయ్యాల కోటేశ్వరరావు, దాసరి చంద్ర సాయి,ఉయ్యాల పండు,తోకల రాము,కుంభ గణేష్, జగన్నాథం ఏసు, జగన్నాథం ఫిరోజ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తాడేపల్లి** ఏకాగ్రతకు, కఠోర దీక్షకు నిలువెత్తు నిదర్శనం ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ఏకలవ్య జయంతి సందర్భం గా తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు గల ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏకాగ్రతతో విలు విద్యను అభ్యసించి అందులో రాణించిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, జి.వేణుగోపాలరెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, ఎ.మురళీ, ఇ.పెంచలయ్య, ఎ.కుసుమ, బి.రవి, ఎ.నరేష్, శౌరి, చాంద్‌బాష, జనసేన పార్టీ శేషుబాబు పాల్గొన్నారు.

చందన రంగారావుపై దాడికి ఖండన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మోపిదేవి మండల టిడిపి నాయకులు మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావుపై ప్రత్యర్థులు గొడ్రాళ్ళతో దాడి చేయడం పట్ల అవనిగడ్డ టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. దాడిలో తీవ్ర గాయాలకు గుర్రై అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రంగారావును టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మేడికొండ విజయ్ ఆసుపత్రికి చేరుకొని బాధితుని పరామర్శిం చారు. ఈ సందర్భంగా రంగారావును మెరుగైన చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యంతోనే వైసీపీ వారి అరాచకాలు కొనసాగుతున్నాయన్నారు. బాధితుడు రంగారావు మాట్లాడుతూ ఎన్నికల్లో తాను కూటమి విజయానికి కషి చేసినందుకు తనను అడ్డు తొలగించుకోవాలని వైసిపి నాయకులు హత్యా యత్నం చేశారన్నారు. ఈ సందర్భంగా బాధితున్ని పరామర్శించి వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన చల్లపల్లి సిఐ నాగప్రసాద్ ఆసుపత్రికి చేరుకొని రంగారావును పరామర్శించారు.టిడిపి నాయకులు రావి రత్నగిరి, ఎంపీటీసీ కొమ్ము పవన్, సర్పంచ్ రాంబాబు, నియోజకవర్గ టిడిపి నాయకులు అవనిగడ్డ వైద్యశాలకు వచ్చి పరామర్శించారు.




రంగారావును వివరాలను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

వర్షాకాలం...విద్యుత్తుతో జాగ్రత్త...

ప్రజాశక్తి-గన్నవరం : వర్షా కాలంలో విద్యుత్ ప్రమాదాలు తరుచూ జరుగుతాయి, అప్రమత్తంగా లేకపోవడంతో విద్యుత్ షాక్ కు గుర్రై ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదాలబారిన పడటం ఖాయం. ముఖ్యంగా రైతులు విద్యుత్ మోటారు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వర్షాకాలంలో పశువులు కూడా కరెంట్ షాక్కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని విద్యుత్ శాఖ ఏఈ రాజు తెలిపారు.

ఇవీ జాగ్రత్తలు..

విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు, బల్బులు వర్షానికి తడవకుండా చూసుకోవాలి. ఇంటిలో కరెంటు వైరిం గ్రీకు ఎర్త్ ఉండేలా చూడాలి. బట్టలు ఆరవేయడానికి ఇనుప తీగలు ఉపయోగించకూడదు. తడిచేతులతో విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలు, హెూల్డర్లు, సర్వీసు వైర్లు, స్విచ్లు తాకకూడదు. పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్ బోర్డులు, విద్యుత్ పరికరాలు ఉంచాలి. ఉరుములు, మెరుపులు వర్షం పడిన సమయం లో గహెూపకరణాలు, టీవీలు, కూలర్లు, ఫ్రిజ్, ఏసీలు, కంప్యూటర్లకు విద్యుత్ సరఫరా లేకుండా చూసుకోవాలి. ప్రమాదకరంగా ఉన్న తీగెలు వెంటనే తొలగించాలి. నీటి సరఫరా దగ్గర, తడిచేలా విద్యు త్పరికాలు, తీగలు ఉంచకూడదు. విద్యుత్ ఘాతానికి గుర్రైతే వెంటనే మెయిన్ స్వీచ్ కట్టేయాలి. పొడి కర్రతో వ్యక్తిని తొలగించాలి. ఆతర్వాత ఆసుపత్రికి తరలించాలి.



రైతులు పాటించాల్సిన సూచనలు.

వ్యవసాయ విద్యుత్ మోటార్లకు తప్పని సరిగా ఎర్త్ ఉండేలా చూసుకోవాలి. పంపుసెట్లు వర్షంలో తడ వకుండా కవర్లు కప్పాలి. పొలంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు తీగెల కింద బురదలో లేకుండా చూసుకోవాలి. మోటారుకు విద్యుత్ సరఫరా చేసే వైర్లు నాణ్యమైనవి వాడాలి. తడిచేతులతో మోటారు స్విచెలు వేయకూడదు. విద్యుత్ తీగెలు తెగితే వాటిని పట్టుకోకూడదు. మరామ్మతులు చేయడానికి వెంటనే లైన్మన్ను రప్పించాలి. మోటారుకు ప్లాస్టిక్ బాక్సులు వేయించాలని దుర్గా ప్రసాద్ వివరించారు. నూ రంపల్లి, వీరపనేనిగూడెం, మాదలవారిగూడెం గ్రామాల్లో విద్యుత్ వైర్లు తగిలి గేదెలు మతి చెందిన పరిస్థితి ఉంది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.

అసైన్డ్ భూములకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : గత ప్రభుత్వం సెంటు పట్టా కింద సేకరించిన తమ అసైన్డ్ భూములకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఏలూరు జిల్లా శనివారపుపేటకు చెందిన రైతులు బుధవారం మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించిన మాజీ మంత్రి ఆళ్ల నాని అండతో సిబ్బంది అన్యాయం చేశారని వాపోయారు. ఎపి గిరిజన సంక్షేమం మినీ గురుకులాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. తన కుమారుడిని గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు తమ కోడలితో కలిసి దారుణంగా హత్య చేయించారని నవులూరుకు చెందిన సత్తెనపల్లి రామాంజనేయులు మంత్రి లోకేష్ ముందు కన్నీంటి పర్యంతమయ్యారు. తన కుమారుడిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇంకా పలు సమస్యలపై పలువురు మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు ఆసాంతం విన్న మంత్రి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

దళితుల్లో రాజకీయ చైతన్యం ఆవశ్యకత పెరిగింది

ప్రజాశక్తి-గుంటూరు : కారంచేడు దళితులపై 1985లో అగ్రకుల భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక న్యాయశక్తిగా మారి నూతన చట్టాలను సాధించి, రాజ్యాంగ హక్కులు పొందగలిగామని భీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు. 39వ కారంచేడు దళిత అమరవీరుల సంస్మరణసభ బుధవారం స్థానిక అరండల్‌పేటలోని భీమ్‌భారత్ కార్యాలయంలో నిర్వహించారు. న్యాయవాది రావినూతల కమలకుమారి సభకు అధ్యక్షత వహించగా పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ దళిత ఉద్యమాలు, అంబేద్కర్ భావజాలం స్ఫూర్తితో రాజకీయ సాధికారతతో దళిత లిబరేషన్ ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.సభలో న్యాయవాది వెంగల కోటేశ్వరరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, ప్రజాపోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు, దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కొరబండి బాబురావు, డెమోక్రటిక్ పార్టీ అధినేత టెన్నిస్‌రాయ్, వివిధ సంఘాల నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, బాపట్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



అరటి ఉత్పత్తులపై ముగిసిన శిక్షణ

విజయవాడరూరల్: ఎఎల్ఇఎపి సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడలో అరటి, వాటి ఆహార ఉత్పత్తులపై వారం రోజులు పాటు జరిగిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ కె.కనకదుర్గ పాల్గొని మాట్లాడుతూ అరటి పండు, కొమ్మ, నార, ఆకులు ఇలా అరటికి సంబంధించిన అన్ని పదార్థాలను ఉత్పత్తులుగా చేసుకొని మార్కెట్ చేసుకునే విధానంపై అవగాహన కలిగి చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 37 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వి.సునీత పాల్గొన్నారు.

వికలాంగులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: మొహరం సందర్భంగా వికలాంగులకు ఉచితంగా కళ్లజోళ్లను అందజేసినట్లు అబ్దుల్ కలాం విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ అధ్యక్షులు ఎండి ఆయూబ్



ఖాన్ చెప్పారు. బుధవారం వన్‌టౌన్‌లోని రాయల్ ఆప్టికల్స్ ప్రాంగణంలో వంద మంది వికలాంగులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుబ్‌ఖాన్ మాట్లాడుతూ వికలాంగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి తమ సంఘం తరఫున కషి చేస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో దాదాపు 15 వేల మంది వికలాంగులు ఉన్నారని చెప్పారు. కంటి చూపు దెబ్బతిన్న నిరుపేదలు డబ్బులేక కంటి పరీక్షలు చేయించుకోలేక అలాగే కళ్లజోళ్లు వేయించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న దాన్ని గమనించి తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ రావెళ్ల రాజ్‌కుమార్, షఫీ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి



దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని తొలి ఏకాదశి పండుగ సందర్భంగా దుర్గమ్మకు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీలక్ష్మి బుధవారం సంప్రదాయ పద్ధతిలో సారెను సమర్పించారు. వీరికి ఆలయ మర్యాదలతో ఈవో కె.ఎస్.రామారావు, ఎఇఒ సుధారాణి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఎమ్.వి.సుధాకర్, స్పృహప్తి ఛారిటబుల్ ట్రస్ట్ మహిళా సభ్యులు లక్ష్మీప్రసన్న, భారతి, కె.పద్మ, ఆర్.రాధ, ఎ.అశ్విని, ఆర్.వాణి, యు.శ్రీకీర్తి పాల్గొన్నారు.



ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది : జెవివి

ప్రజాశక్తి-తిరువూరు: అన్ని రంగాల కంటే ఉపాధ్యాయ రంగం ఎంతో గొప్పదని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. సుదీర్ఘ కాలం ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జెవివి నాయకులు ఎస్.జగన్మోహనరావు, పి.శీనయ్య దంపతులను బుధవారం తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ విద్యను అందించే ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. జెవివి ఆధ్వర్యంలో 11 సంవత్సరాలుగా తిరువూరులో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో మోహనరావు, శీనయ్య అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఉపాధ్యాయులుగా తమ వృత్తిని నిర్వర్తిస్తూ సమాజ సేవలో వారిరువురూ భాగస్వాములు అవ్వటం అభినందనీయమని జెవివి జిల్లా మాజీ కార్యదర్శి ఎం.హరికష్ణ అన్నారు. వైద్య శిబిరం ప్రారంభించిన దగ్గర నుండి సేవలందిస్తున్న మోహనరావు, శీనయ్యల సేవలు మునుముందు కూడా జనవిజ్ఞానవేదికకు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక విశ్లేషకులు ఎస్.వెంకటరావు, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, నాయకులు ఎం.రాంప్రదీప్, ఎం.సుధాకర్, డి.సుదర్శన్, కె.పాపారావు, కె.శేషగిరి, బి.సైదులు, ఎం.ప్రకాష్, ఎస్.రాంకుమార్, సుభాని, కాబోలు లక్ష్మణరావు, ఎస్.ఉషారాణి, పి.లీల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వి.శేషగిరి, యాకూబ్ అలీ, ఎన్జీఓ నాయకులు ఎం.ప్రకాశ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెవివి నాయకులు

21న వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ



విజయవాడ: తెలుగు రాష్ట్రాలలో సమాజాన్ని పురోగమనం వైపు నడిపించేందుకు కృషి చేసిన వైతాళికుల చిత్రపటాలను ఈ నెల 21న బాలోత్సవ్ భవన్లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంబి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ కెఎన్ మల్లేశ్వరి, సాహితీ విమర్శకులు తెలకపల్లి రవి, క్రియా పిల్లల పండుగ నిర్వాహకులు ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, సాహితీవేత్తలు బాలాంత్రపు ప్రసూన, అనిల్ డాని, సత్యాజీ, ఎస్.అనిల్ అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. తెలుగు నాట 1650, 1700 సంవత్సరాల కాలంలోనే అభ్యుదయ భావాలు పూరించిన పోతులూరి వీరబ్రహ్మం, ప్రజాకవి వేమన, వితంతు వివాహాలు జరిపించిన కందుకూరి, కుల వ్యవస్థపై కత్తి ఝులిపించిన గురజాడ, తెలుగు భాషను పామరుల వద్దకు చేర్చిన గిడుగు రామ్మూర్తి, స్త్రీల హక్కులకై పోరాడిన గుడిపాటి వెంకటాచలం, స్వాతంత్ర్యం పేదల కోసమని నినదించిన కుసుమ ధర్మన్న, తెలంగాణ పోరాట యోధుడు మగ్దూం మోహిద్దీన్, మరో ప్రపంచం కోసం శంఖారావం పూరించిన శ్రీశ్రీ, స్త్రీల అభ్యుదయానికి కృషి చేసిన బండారు అచ్చమాంబ, తెలంగాణ పోరాటానికి సాహిత్యం అందించిన దాశరధి కృష్ణమాచార్య మొదలైన 32 మంది మహోన్నతుల చిత్రపటాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు రచయితలు, కవులు, కళాకారులు సాంస్కృతిక రంగ ప్రేమికులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, ప్రముఖ రచయిత్రి మందరపు హైమావతి, ప్రముఖ చిత్రకారులు అరసవిల్లి గిరిధర్, క్రాంతి కిరణ్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, జెఎంఎస్ వ్యవస్థాపకులు జె చక్రవర్తి, పాత్రికేయులు కె జయరాజ్, నాటక దర్శకులు పిళ్ల నటరాజు, టి.క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ప్రత్యేక స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి-భవానీపురం: 42వ డివిజన్ రైతు బజార్‌లో కందిపప్పు, బియ్యం ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే సుజనాచౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట మార్కెట్లో బియ్యం కందిపప్పు ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఈ నేపథ్యంలో రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కో-ఆర్డినేటర్ తిరుపతి సురేష్, 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష, టిడిపి అధ్యక్షుడు ముదిరాజ్ శివాజీ, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, ముదిగొండ శివ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సుజనా చౌదరి పేర్కొన్నారు. బుధవారం 42, 43 డివిజన్లలో ఆయన పర్యటించారు. కుక్కల బెడద తీవ్రంగా ఉందని, రైతుబజార్‌కు వెళ్లేందుకు రోడ్డు సరిగ్గాలేదని, వాటర్ ట్యాంక్ వద్ద గల కార్పొరేషన్ ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్, హాస్పిటల్ నిర్మించాలని, రెడ్డి కాలనీ రోడ్ నిర్మించాలని ప్రజలు కోరారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : సుజన

హెల్మెట్ ధరించడంతో ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని వాహనచోదకులకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. బుధవారం భవానీపురం శివాలయం



హెల్మెట్‌పై అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ సుజనాచౌదరి

సెంటర్ వద్ద నుంచి స్వాతి సెంటర్ వరకు వాహనదారులను చైతన్యపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వాహన చోదకులు అందరూ హెల్మెట్ ధరించాలని, దీని వల్ల ప్రమాదాల బారిన పడకుండా ఉంటారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం హెల్మెట్ ధరించాలన్నారు. ఈ ర్యాలీలో ట్రాఫిక్ ఏసిపి బి. జనార్ధన్, భవానీపురం సెక్టార్ ట్రాఫిక్ సిఐ బి.వెంకటేశ్వరరావు, భవానీపురం సిఐ ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-వన్‌టౌన్: మే 5వ తేదీన విధి నిర్వహణలో చెరువు మాదారం వద్ద ట్రాక్ రైల్ ప్రమాదంలో మరణించిన ఉద్యోగి సిహెచ్.రవి కుటుంబానికి సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్, విజయవాడ కమిటీల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం కింద రూ.1.50 లక్షల చెక్కును బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ పి.రవీందర్, విజయవాడ డివిజనల్ సెక్రెటరీ లీలా, సిసిఎస్ రైల్వే ప్రెసిడెంట్. చిలుకు స్వామి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి-మైలవరం: జనసేన క్రియాశీలక సభ్యుడైన జంగా శివారెడ్డికి క్రియాశీలక సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా పాలసీ ప్రకారం రూ 49,980 చెక్కును ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్ రావు చేతుల మీదుగా బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుండి 28వ తేదీ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు బోలేశెట్టి శ్రీకాంత్, అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, జీవీ రవితేజ తదితర నాయకులు పాల్గొన్నారు.

